


## *(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)*

**71**

(7 ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఈ సంసారం చెయ్యడంకంటే** సన్యాసం పుచ్చుకోవడం ఎంతో నయం" అని చాలామంది గృహస్థులు విసుక్కుంటూ వుండటం పరిపాటి. భగవంతుని కొలిచి తరించాలనే కోర్కెతో కన్న సంసారంలో కష్టాలు పడలేక సన్యాసం పుచ్చుకునేవారి సంఖ్యే ఎక్కువ వుంటుందని పెద్దలు చెపుతూ వుంటారు.

అయితే ఈ తరగతికి చెందిన వాళ్ళందరూ సామాన్యంగా బావాజీలుగా తయారవుతూ వుంటారు. "కోపం వచ్చిన మర్నాడు గోల్కొండ మఠంలో వుందా? తెలిసిందా?" అని మా బంధువు ఒకాయన భార్యను రోజూ బెదిరిస్తూవుండేవాడు.

మా చిన్నతనంలో పెంటపాడు మఠాన్ని గురించికూడా ఎంతో చెప్పుకునేవారు. "కాస్త వంట ఆలస్యమైతే మావారు పెంటపాడు వెడతానంటారేం ఖర్మమో. అక్కడ ఏకతార మ్రోగిస్తూ కూర్చుంటారుట. ఎవరొచ్చి వచ్చిన కూరలతో పది గంటలకే వడ్డించిపోతారో? " అనేది ఒక ఇల్లాలు.

### *తూర్పు నుంచి వస్తూంది లక్ష్మి*

ఈ బావాజీలు ఎక్కువగా "సకినాలు" చెపుతూ తిరుగుతూ వుండేవారు. "వచ్చే సంవత్సరం మీకు ధనలాభం వుంది. తూర్పు దిక్కునుంచి వచ్చి కలుస్తుంది మీకు లక్ష్మి" అని చెప్పేవారు. పై సంవత్సరం వచ్చినా అదే జ్యోతిష్యం అయితే తూర్పు పోయి ఏ పడమరో వచ్చేది.

"ఈ ఏడే వస్తుందని చెప్పావుగా బావాజీ! ఏమి కలసిరాలేదేం" అని ప్రశ్నిస్తే "మీరు లక్ష్మిని సరిగా ఆహ్వానించలేదు. అందువల్ల ఆగ్రహం వచ్చింది. ఒక్క తాయెత్తు కడతాను. కీడు తొలిగిపోతుంది. రెండు శేర్ల బియ్యం, దోసెడు పెసరపప్పు, ఏదైనా కాయగూర, రూపాయి పావలా తెచ్చుకోండి. మీకు శుభం కలుగుతుంది. లక్ష్మి వచ్చిన తర్వాత బావాజీకి ఒక పట్టువస్త్రం, పదిరూపాయలూ ఇవ్వండి" చాలు అని చెప్పేవాడు.

చాలామంది ఆ మాటలు నమ్మి అడిగిన వన్నీ యిచ్చి తాయెత్తు తీసుకునేవారు. బావాజీ ఆ తండులాలతో అన్నం వండుకుని ఆ రూపాయి పావలాతో పత్రి కొనుక్కుని హాయిగా కాలం గడిపేవాడు.

ఈ రోజుల్లో బావాజీల సంఖ్య తగ్గినట్లు కనిపిస్తుంది. ఆ వేషధారణ వల్ల పోషణ సరిగా జరగకపోవడమే కారనం కావచ్చు. పోతే సన్యాస ఆశ్రమాలు పుచ్చుకునే మహనీయులు కొందరున్నారు. వారి పరువు పోగొట్టడానికా అన్నట్టు కొందరు "చౌకరకం యతీశ్వరులు"గా కూడా వుంటూ వుంటారు.

***తనపట్ల చిమ్మెట - పరాయిచోట పట్టుపురుగు***

ప్రక్క ఇంటావిణ్ణి ఏదో అని అల్లరై వాళ్ళు జాతకం తిరగవేయడానికి బయలుదేరి ఒకాయన పారిపోయి 'యతి'గా మారాడని ఒక కథ చెపుతూ వుండేవాడు మా పెద్దనాన్నగారు. తనపట్ల చిమ్మెటగా నిలిచిన భార్య పరాయివానివద్ద పట్టుపురుగుగా మారిందని తెలిసి కొందరు యోగులుగా మారిన ఘట్టాలు వున్నాయి.

ముందు ఆలోచన లేకుండా పదిమంది సంతానాన్ని కని తర్వాత వారి పెట్టుపోతలకు చిట్టెడు నూకలు దొరక్క చివికిన గుండెలు చేతపట్టుకుని ఆశ్రమం పుచ్చుకున్న బుద్ధిమంతులు కొందరుంటారు.

ఏమైనా ఈతిబాధలవల్ల ఇంట్లో నిలవలేక ఇంత వుప్పురంగు వస్త్రాలను పట్టించి బయలుదేరినవారు పడటానికి యతుల జాబితాలోపడ్డా, వారికి తగిన భక్తివైరాగ్యాలు మృగ్యం. వీరందరూ పుట్టగతులు లేవని భయపడినవారే గానీ భగవంతుని పాదం పట్టి మోక్షప్రాప్తికి అటమటించే సర్వసంగ పరిత్యాగులు మాత్రం కాదు.

ఒకాయన ఉద్యోగం దొరక్క అతి దీనస్థితిలో వున్నాడు. ఏదైనా వుపాయం చెప్పమని ఒక పెద్ద మనిషి దగ్గరికి వెళ్ళాడు. ఆయన క్షణమైనా ఆలోచించకుండా ఇలా చెప్పాడుట. "ఈ బుష్ కోట్ వేషంతో లాభం లేదు, కాషాయ వస్త్రం ధరించు. రెండు అంగుళాలు గడ్డం పెంచు. ఒక్క రుద్రాక్షమాల మెడలో వేసుకో. ఇక చూసుకో నీ సంపాదన. ఏడాదిలో దేవుడికో గుడి, నీకో మేడకూడా కట్టించుకోవచ్చు. "

ఇందులో కొంత సత్యం లేకపోలేదు. ఇటీవల ఒక దొంగ భక్తుడు ఒక మహానగరంలో చేరి తను దేవదూతనని సమస్త కార్యాలు సాధించగలననీ చెప్పాడు. ఇంకేవుంది జనం గుంపులు గుంపులుగా వచ్చిపడ్డారంట. అనేకమంది కానుకలు తెచ్చి సమర్పించారట.

ఎప్పుడూ బయటికి వెళ్ళని స్త్రీలు కూడా ఏదో ఒక కోర్కె మనస్సులో పెట్టుకుని ఆయన దర్శనానికి వెళ్ళారట. కానుకలు గుమ్మరించిరట. చివరికి తేలింది ఆయన చెప్పిందేదీ కాలేదని. ఆయనలో ఏ విధమయిన శక్తిలేదని ఈ విషయమాభక్తుని చెవినిపడిందే తరువాయి ఆయన పారిపోయాడట.

***విషయం తేలేసరికి లక్ష సంపాదన***

ఆయనగారిని పట్టుకుని శిక్షిద్దామనుకున్నవారి పాచికలేమీ పారలేదుగానీ అప్పటికే ఆయన ఒక లక్ష రూపాయలు సంపాదించి వెంట తీసుకుపోవడం మాత్రం జరిగిందట. అంతా విచారపడ్డారట. ఒక ముసలి పండితుడు మాత్రం "ఆయన భగవంతుణ్ణి నమ్ముకుని వచ్చాడు. ఆయనకు మేలు జరిగింది. మనం నరుణ్ణి నమ్ముకున్నాం. మనకిలా శాస్తి జరిగింది" అని వ్యాఖ్యానించాడట.

మా చిన్నతనంలో మా వూరికి స్వాములవారు వచ్చారు. ఆయనగారికి వేడినీళ్ళంటే ఎంతో యిష్టం. ప్రతిపూటా పదికాగుల నీళ్ళన్నా పోసుకునేవాడు. తెల్లవారేటప్పటికి వూళ్ళోనుంచి పదికాగులు వచ్చి పడేవి. కాగుక్రింద మంట పెడితే ఎంతో పుణ్యమని స్త్రీలు వచ్చి పడేవారు.

అలా మంటపెట్టడానికి తగువులాడుకోవలసి వచ్చేది. "ఒక్క పుల్ల నన్నుకూడా వెయ్యనియ్యండి పొయిలో. ఒక్కసారి విసరనివ్వండి" అని బ్రతిమాలడం జరుగుతూవుండేది. అలాటి అవకాశం దొరక్కపోతే వారు వేరే పొయ్యి అంటించి, మరో కాగుతో నీళ్ళు పెట్టేవారు.

నీళ్ళు నూతిలోనుంచి తోడుకురావడానికి, వేడినీళ్ళు తొలపడానికి, ముంచి అందించడానికి పోటీలు పడేవారు. స్వాములవారు వచ్చి "తగువులాడకండి. మీరు కాచిన నీళ్ళన్నీ పోసుకుంటా కాగులన్నీ ఖాళీచేస్తా"నని అభయమిచ్చేవారు. ఇచ్చి ఒక ఎత్తుపీట మీద కూర్చుని నీళ్ళు గుమ్మరించమని సిగ్నల్ ఇచ్చేవారు.

ఎంత వేడిగా పోసినా `ఇంకావేడి`, అనేవారు. ఆ మెదడు ఎంత గట్టిదో చెప్పలేం. అసలది మాడా! మాడుపట్టా! బోర్లించిన రాగితట్టా! అనిపించేది.

***వేడినీళ్ళతో వైకుంఠప్రాప్తి.***

మా ప్రాంతంలో ఆయన్ని "వేడినీళ్ళస్వాముల"వారు అనేవారు. రెండుపూటలా అలా స్నానం చేసి, వేళకు `భిక్ష` చేసి హాయిగా నిద్రపోయేవారు. ఆయనకు నిద్రాభంగం కాకుండా శిష్యులు కాపలా కాసేవారు. "స్వాములవారింకా నిద్రపోతున్నారా?" అని ఎవరైనా అంటే `అది నిద్రగాదండీ యోగ సమాధి` అని చెప్పేవారు శిష్యులు.

మా బంధువుల్లో ఒకాయన కోపం వచ్చినప్పుడల్లా ఒక కొల్లాయికట్టుకుని దొడ్లో చెట్టుక్రింద కూర్చునేవాడు. వానవచ్చినా లేచేవాడు కాదు. "ఇదేమిటి ఇక్కడ కూర్చున్నారు?" అంటే –

"నేను తెల్లారగట్ట నాలుగింటికి ఆశ్రమం పుచ్చుకున్నాను. ఇక ఇంట్లోకిరాను. పాలు వగైరాలు ఇక్కడికేతెండి – ఏ వూరు వెడదామా! పీఠం ఎక్కడ స్థాపిద్దామా? అనే ఆలోచన తేలలేదు. అందాకా ఇక్కడే వుంటాను. మీరు ఇదివరకటిలాగా `నాన్నా, బాబాయి, మామయ్యా` అని పిలవకండి. స్వామీ అనండి" అని చెప్పేవాడు.

●●●

Post your comments